ప్రజావసరాలను సమకూర్చడమే లక్ష్యం



పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకొని అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సనత్‌నగర్ నియోజకవర్గంలో దాదాపు రూ.1400 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఆరు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సైతం తాము పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, డీఎంసీ జగన్, ఈఈ ఇందిర, వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు, ఎలక్ట్రికల్ డీఈ అమర్నాథ్, నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఖలీల్ బేగ్, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అమీర్‌పేట డివిజన్ పరిధిలో..

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ రేణుకానగర్‌లో రూ.11.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న వాటర్ లైన్, సత్యం థియేటర్ వద్ద రూ.7 లక్షతో సివరేజీ లైన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో రూ.16.50 వ్యయంతో చేయనున్న వాటర్, సివరేజీ లైన్ పనులను సోమవారం మంత్రి తలసాని ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక దీర్ఘకాలిక సమస్యలను సైతం పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, వివిధ శాఖల అధికారులు జగన్, ప్రభు, ఇందిర, బీఆర్‌ఎస్ నాయకులు హనుమంత్‌రావు, నర్సింహ,బల్‌రాం పాల్గొన్నారు.

హమాల్‌బస్తీలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధం..

బన్సీలాల్‌పేట్: హమాల్‌బస్తీలో డబుల్ బెడ్రూమ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తలసాని శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోమవారం హమాల్‌బస్తీలో రూ.18 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ కె. హేమలత, పవన్‌కుమార్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హమాల్‌బస్తీలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు నిధులు మంజూరయ్యాయని ప్రజలు ముందుకు రాకపోవడంతో ఇళ్ల కార్యక్రమం ముందుకు సాగడం లేదన్నారు. బస్తీలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా ప్రజలకు వైద్య ఆరోగ్యపరంగా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. డబుల్ ఇళ్ల నిర్మాణ విషయంలో ఐడిహెచ్ కాలనీ తెలంగాణకు మోడల్‌గా నిలిచిందన్నారు. ఐడిహెచ్ కాలనీలో రూ.16 లక్షల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. శిథిలావస్థకు చేరిన ఐడిహెచ్ కాలనీలో డబుల్ ఇళ్లను నిర్మించి ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఐడిహెచ్ కాలనీలో 3,4,5,10 బ్లాక్‌లలో ఇళ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ శంకర్, ఈఈ సుదర్శన్, జలమండలి సీజీఎం ప్రభు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి కాంగ్రెస్ కృషి



చీరలు పంపిణీ చేసిన రవీందర్‌గౌడ్

సనత్‌నగర్: మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు సోమవారం ఉదయం ఆయన బతుకమ్మ చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళాభ్యున్నతి జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీల్లో మహిళలకు సముచితస్థానం కల్పించారన్నారు. అలాగే ప్రతి వర్గానికీ లబ్ధి చేకూరేలా పథకాలను ప్రవేశపెట్టి తప్పకుండా అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో రమేష్, కమల్‌రాజ్, మణిమాల, వెంకటరమణ, లలిత పాల్గొన్నారు.

'కాంగ్రెస్ గెలుపు ఖాయం'



పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న దీపక్ జాన్

సికింద్రాబాద్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని డెటా అండ్ టెక్నాలజీ విభాగం నేషనల్ కోఆర్డినేటర్ దీపక్ జాన్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు హామీలకు సంబంధించి సీతాఫల్‌మండిలోని బ్రాహ్మణ బస్తీలో పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని, ఈ సారి కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ ప్రచారంలో సందీప్ రాజ్, సునీల్, మల్లేష్, రజనీకాంత్, వెంకట్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 33, దొండ 28, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 70, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 15, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 27, ఆలుగడ్డ 21, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 50, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఓయూలో కాన్షీరాం వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బీఎస్‌పీ వ్యవస్థాపక అధ్యక్షులు కాన్షీరాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బొర్రెల్లి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో జరిగిన మరో కార్యక్రమంలో కాన్షీరాం చిత్రపటానికి నివాళి అర్పించారు.

హాస్టల్ వసతికి ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో హాస్టల్ వసతి కోసం పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సోమవారం క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ రూ.3 వేలకు మెస్ రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. అయితే.. పీజీ మొదటి సంవత్సరం మెస్ బకాయిలను పూర్తిగా చెల్లిస్తేనే హాస్టల్ వసతి కల్పిస్తామని అధికారులు చెప్పడంతో రోడ్డు పై వంటావార్పుతో ధర్నా చేపట్టగా ఓయూ పోలీసులు 40 మంది విద్యార్థులను అరెస్ట్ చేశారు.

గొర్రెల పంపిణీ వేగవంతంగా పూర్తి చేయాలి



బాల్‌రాజు యాదవ్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ డా. కొమ్ము అశోక్ యాదవ్ కోరారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో తెలంగాణలోని పలు జిల్లాల అధ్యక్షులు సంబంధిత మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ షిప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బాల్‌రాజు యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే చాలా మంది డీడీలు చెల్లించి గొర్రెల యూనిట్ల కోసం ఎదురు చూస్తున్నారని యూనిట్ల సంఖ్యను 500 పెంచాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో గజ్జి రమేష్ యాదవ్, ఉప్పెర శ్రీనివాస్ యాదవ్, మద్దూరి గట్టయ్య ఉన్నారు.

కళా సిల్క్ ఎగ్జిబిషన్‌కు ఆదరణ



వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లో కొత్తా కామకోటి కల్యాణ నిలయంలో కళా సిల్క్ హ్యాండ్లూమ్ ఇండియా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని అన్ని రకాల చేనేత కళాకారులతో నేయబడిన, కాటన్ చీరలు, చేనేత వస్త్రాలు లభిస్తాయని నిర్వాహకులు వినోద్ తెలిపారు. ఎగ్జిబిషన్‌లో పండుగల నేపథ్యంలో పలు ఆఫర్లు ఇస్తున్నట్లు తెలిపారు. వివిధ రకాల చేనేత బెడ్‌షీట్ కవర్లు, బెడ్ షీట్స్, కళాకారులు చేతితో తయారు చేసిన బొమ్మలు, వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంగా కేశవ స్మృతి సంవర్ధన సమితి, కేశవ నిలయం భాగ్యనగరం సహకారంతో డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ అధినేత కె.ఉపేందర్ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ 4వ బ్యాచ్ ప్రారంభమైంది. ఉపేందర్ మాట్లాడుతూ.. అనేక మంది పేదతరగతికి చెందిన విద్యార్థినీవిద్యార్థులు మాత్రమే తమ వద్ద శిక్షణ తీసుకుంటున్నారన్నారు. ఉన్నత లక్ష్యంతో తాము ఈ శిక్షణ ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కంటోన్మెంట్ గ్రంథాలయాల చరిత్ర ఘనం



భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

కంటోన్మెంట్: కంటోన్మెంట్లోని చరిత్రాత్మక గ్రంథాలయాలకు పూర్వవైభవం కల్పించేలా కృషి చేస్తున్నామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలో రూ.1.5 కోట్ల వ్యయంతో ఆధునీకరించనున్న గ్రంథాలయ భవనానికి సోమవారం ఆయన మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బోయిన్‌పల్లిలోని గ్రంథాలయంతో తనకు ఎంతో అనుబంధం ఉందని చిన్నతనంలో దిన పత్రికలు చదివేందుకు తాము గ్రంథాలయానికి వెళ్లే వాళ్లమని గుర్తు చేసుకున్నారు. కాలక్రమేణా వెళ్లే వారి సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. భవనాలు శిథిలావస్థకు చేరడం, మారుతున్న జీవనశైలికి అనుగుణంగా పుస్తకాలు సమకూర్చకపోవడంతో గ్రంథాలయాలకు ఆదరణ తగ్గిందన్నారు. ఈ నేపథ్యంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కంటోన్మెంట్‌లోని గ్రంథాలయాలను ఆధునీకరించాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ కార్యదర్శి సురేశ్, నాయకులు మర్రి రాజశేఖర్ రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు నళిని కిరణ్, లోకనాథం, శ్యామ్‌కుమార్, వేణుగోపాల్ రెడ్డి, ముప్పిడి మధుకర్, ప్రభు గుప్తా పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి

పద్మారావునగర్: బాల్య వివాహాల రహిత జిల్లా ప్రచార కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు. ఆశ్రిత సంస్థ గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు డివిజన్లలో కై లాస సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ అధ్వర్యంలో పిల్లల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పిల్లల అక్రమ రవాణా, లైంగిక వేధింపులపై ప్రజల్లో పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఆశ్రిత సంస్థ కార్యదర్శి ఎస్. నాగరాజు మాట్లాడారు. పిల్లల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పర్వతాలు, ప్రణయ్, శేఖర్, అమన్ వేదిక ఎల్లయ్య పాల్గొన్నారు.

గోషామహల్ అభ్యర్థిగా మహేంద్రకుమార్‌ను ప్రకటించాలి



సమావేశంలో అన్ని జిల్లాల నేతలు

సనత్‌నగర్: గోషామహల్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మున్నూరు కాపు సంఘం నగర అధ్యక్షులు ఆర్వీ మహేంద్రకుమార్‌ను ప్రకటించాలంటూ ఆ సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో సోమవారం అన్ని జిల్లాలకు చెందిన మున్నూరు కాపు సంఘం నేతలు సమావేశమై తీర్మానం చేశారు. ఉద్యమకారుడైన మహేంద్రకుమార్‌ను గోషామహల్ అభ్యర్థిగా ఎంపిక చేసి ఉద్యమకారులపై ఉన్న గౌరవాన్ని సీఎం కేసీఆర్ చాటుకోవాలన్నారు. మహేంద్రకుమార్‌ను అభ్యర్థిగా ప్రకటిస్తే మున్నూరు కాపు సంఘం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో దేవయ్యపటేల్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, హరిశంకర్, రామారావు, రాజారాం పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో వర్సిటీల సిబ్బంది నిరాశ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎన్నికల కోడ్ అమలుతో వర్సిటీల అధ్యాపకులు నిరాశ చెందారు. గత పదేళ్లుగా ఆందోళనలు చేస్తున్న ఉద్యోగాలు పర్మనెంట్ చేయకుండా సీఎం కేసీఆర్ అన్యాయం చేశారని కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. జేఎల్, డీఎల్, పాలిటెక్నికల్ కాలేజీల అధ్యాపకులను పర్మనెంట్ చేసి చివరకు ఆర్టీసీ ఉద్యోగులను సైతం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన సీఎం కేసీఆర్ యూనివర్సిటీల సిబ్బందిని ఇబ్బందులకు గురి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

నల్లకుంట: ఏ కోర్సు చదివినప్పటికీ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకుంటే ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ.. వస్తాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ప్రధానంగా ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులపై ఆసక్తి పెంచుకోవాలని యువతకు సూచించారు. తెలంగాణ అకాడమీ స్కిల్ అండ్ నాలెడ్జ్ అధ్వర్యంలో సోమవారం న్యూ నల్లకుంట శివం సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలోని ఆర్‌ఎస్‌టీ టెక్నాలజీస్‌లో కొత్త బ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాలేరు జ్యోతి ప్రజ్వలన చేసి కొత్త కోర్సులను ప్రారంభించి మాట్లాడారు. యువతలో వృత్తి నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. రంజిత్ కౌర్ పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిని ఆరోగ్యశ్రీలో చేర్చాలి

ముషీరాబాద్: రాష్ట్రంలో విజృంభిస్తున్న డెంగీ, వైరల్ జ్వరాల కారణంగా ప్రజలు ఆరోగ్యంగానే కాక ఆర్థికంగా కూడా కుంగిపోతున్నారని కాబట్టి ఈ వ్యాధిని ఆరోగ్యశ్రీలో చేర్చి ఉచితంగా వైద్యసేవలు అందించాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు స్వరూప, పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రవికృష్ణలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఈ సంఘాల ప్రతినిధులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత 20 రోజులుగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయని ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ తీవ్రత అధికంగా ఉందనినారు. అయినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవడం లేదన్నారు. పీఓడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు లక్ష్మీభాయ్, వరలక్ష్మి, దేవమణి, నాగమ్మ, పుష్ప తదితరులున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

అడ్డగుట్ట: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. సికింద్రాబాద్–లాలాగూడ రైల్వే స్టేషన్ల మార్గ మధ్యలోని పట్టాలపై సోమవారం ఉదయం సుమారు 35 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు గ్రీన్ కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్, పింక్ కలర్ చెక్స్ లుంగీ, ఛాతీ పై శ్రీలత, అమ్మ అని పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గిరిజనుల హామీలను అమలు చేయాలి



అభివాదం చేస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు గిరిజనుల హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్‌లు డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వారు మాట్లాడుతూ.. ఆయా పార్టీలు తమ మ్యానిఫెస్టోలో గిరిజనుల డిమాండ్లను చేర్చాలన్నారు. ఓట్ల కోసం వాగ్దానాలు చేస్తూ.. అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి వాగ్దానాలకు మోసపోకుండా గిరిజన సమాజం చైతన్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన తరువాత ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో ఆయా సర్పంచ్‌లు అప్పులపాలై 15 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 15 లక్షల ఎకరాల పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామన్న సీఎం కేసీఆర్ కేవలం రూ.4 లక్షల ఎకరాలకు మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. గిరిజన సంఘం అధ్యక్షుడు ధర్మానాయక్, గిరిజన మేధావుల ఫోరం అధ్యక్షులు ధనుంజయ్‌నాయక్, సేవాలాల్ సేనా అధ్యక్షుడు రాంబాబునాయక్, వివిధ సంఘాల నాయకులు రఘు, రవీంద్రనాయక్, సుమన్, అమర్‌సింగ్, బాలు, దేవీలాల్ తదితరులున్నారు.

రౌడీషీటర్ రిమాండ్



బొట్టు శివ

బౌద్ధనగర్: విధుల్లో ఉన్న హోం గార్డుపై దాడిచేసిన రౌడీషీటర్‌పై కేసు నమోదైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఎంఏ. అజీజ్ వివరాల ప్రకారం.. అంబర్ నగర్ ప్రాంతానికి చెందిన బొట్టుశివ (24) రౌడీషీటర్ పార్శిగుట్టలోని గోవా పాన్‌షాప్ వద్ద సోమవారం వేకువజామున గొడవ చేస్తున్నాడు. అదే సమయంలో అక్కడ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ముఖేష్, హోంగార్డు ఓబుల్ రెడ్డి అక్కడికి వెళ్లి గొడవ ఆపే ప్రయత్నం చేస్తుండగా బొట్టు శివ వారిని అసభ్యపదజాలంతో దూషించడమే కాకుండా ఓబుల్‌రెడ్డిపై చేయి చేసుకోవడంతో బొట్టు శివపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పోస్టు ఎమ్మెస్సీ రేడియోలాజికల్ ఫిజిక్స్‌లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ ఫిజిక్స్ విభాగంలో కొనసాగుతున్న రెండు సంవత్సరాల పోస్టు ఎమ్మెస్సీ డిప్లొమా ఇన్ రేడియోలజికల్ ఫిజిక్స్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి సోమవారం తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్ లేదా న్యూక్లియర్ ఫిజిక్స్ కోర్సును 60 శాతం మార్కులతో పూర్తి చేసిన అభ్యర్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులు. నవంబరు 19న జరిగే ప్రవేశ పరీక్షకు శక్తి గల అభ్యర్థులు ఈ నెల 31 వరకు, రూ.500 అపరాధ రుసుంతో వచ్చే నెల 10 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చైతన్య యాత్రకు స్పందన



చైతన్య యాత్రలో విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓటు చైతన్యం–రాజకీయ భాగస్వామ్యం కోసం తెలంగాణ విద్యార్థి రాజకీయ జేఏసీ నాయకులు చేపట్టిన చైతన్య యాత్రకు విశేష స్పందన లభిస్తోందని జాక్ చైర్మన్ చంద్రశేఖర్ తెలిపారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ప్రారంభమైన యాత్ర రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పర్యటించి ప్రజలను చైతన్య పర్చనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిగొండ నరసింహ, వంశీనాయక్, లత విశ్వజన్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలి



ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించిన కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: దేవీ శరన్నవరాత్రి, బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆయా ఉత్సవాల నిర్వహణపై సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో సోమవారం జరిగిన సమీక్షా సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈఓ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారుల సమన్వయంతో ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా నీటి సదుపాయం జరిగేలా చూస్తామన్నారు. అలాగే పండుగలు ఘనంగా జరుపుకోవాలనే సంకల్పంతో ఆలయాలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయిస్తోందన్నారు. విజయదశమి రోజున రావణ దహనం, శమీపూజ వంటి కార్యక్రమాలు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న దృష్ట్యా అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కొలను బాల్‌రెడ్డి, అర్చకులు రవీంద్రాచార్యులు, సుదర్శనాచార్యులు, గణేష్ కులకర్ణి, గోపాల్‌జోషి పాల్గొన్నారు.

సందడిగా మేరా దేశ్.. మేరా మాటీ



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

చిలకలగూడ: సికింద్రాబాద్ బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నాగేశ్వరరెడ్డి నేతృత్వంలో సోమవారం మేరా దేశ్.. మేరా మాటీ ర్యాలీని సందడిగా నిర్వహించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఢిల్లీలో అమరవీరుల స్తూపం నిర్మాణం కోసం సికింద్రాబాద్‌లోని ఐదు డివిజన్లలోని ప్రముఖ దేవాలయాల పుణ్యభూమి నుంచి మట్టిని సేకరించినట్లు వివరించారు. నామాలగుండు వీరాంజనేయ దేవాలయం నుంచి చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి సేకరించిన మట్టికి ప్రత్యేక పూజలు నిర్వహించి బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్‌కు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్‌గౌడ్, బండపల్లి సతీష్, ఆదం విజయ్‌కుమార్, మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి, నాయకులు హరి, ప్రభుగుప్తా, శారద, మహేష్ సాయిదత్తు, రాముపర్మ, రాజేశ్వరరావు, శ్రీధర్, హనుమంతు, నరేందర్, వేణుగోపాలచారి పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ఉండాలి



మాట్లాడుతున్న పండిట్ వికాష్‌శర్మ

సనత్‌నగర్: బేగంపేట మయూరిమార్గ్‌లోని దేవనార్ అంధుల పాఠశాలను అఖిల భారత సామాజిక వికలాంగుల హక్కుల కార్యకర్త పండిట్ వికాష్‌శర్మ సోమవారం సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు. అలాగే అక్కడి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా దేశంలో దివ్యాంగుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి తమ లక్ష్యాలను చేరువ కావాలని సూచించారు. కార్యక్రమంలో దేవనార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సాయిబాబాగౌడ్, కరస్పాండెంట్ జ్యోతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీకి స్టూడెంట్ వింగ్ ఏర్పాటు

ఉస్మానియా యూనివర్సిటీ: ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ)కి స్టూడెంట్ వింగ్ ఏర్పాటు చేశారు. సోమవారం ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రంలో జరిగిన ఆవిర్భావ సభలో డీఎస్పీ అధినేత డాక్టర్ విశారదన్ ముఖ్య అతిథిగా పాల్గొని స్టూడెంట్ వింగ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థి హక్కులు, సమస్యలపై నిస్వార్థంగా పోరాడనున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.కార్తీక్, కోఆర్డినేటర్ సైదబాబు, లింగయ్య, విష్ణు, దశరథ్, శివ, సదానంద, శివ, సుబాష్, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డా.విశారదన్

ఫైన్‌ఆర్ట్స్ వర్సిటీ హాస్టల్‌లో ప్రవేశాలకు వినతి



వినతి పత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: జేఎన్‌ఏఎఫ్‌యూ (ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ) హాస్టల్‌లో విద్యార్థులకు ప్రవేశాలు చేపట్టాలని ఏబీవీపీ నాయకులు సోమవారం రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రికి వినతి పత్రం సమర్పించారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో గత మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించడం లేదని ఏబీవీపీ నాయకులు భరత్‌కుమార్ పేర్కొన్నారు. హాస్టల్ వసతి లేనందున విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే హాస్టల్ భవనానికి మరమ్మతులు చేపట్టి ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో శ్రీమంత్ కుమార్, విజయ్, సురేందర్, రోహన్, శ్యామ్ చరణ్ ఉన్నారు.